స్కెచ్

# ఫలించిన ప్రతీక్ష

"అమరమిత్ర"

"రిజిష్టర్, అ..ర్. ఈ ఉత్తరాలు దయచేసి కొంచెం... రెండు రిజిష్టర్... మిగతా మూడు అండర్ సర్టిఫికెట్ ఆఫ్ పోస్టింగ్" హేండ్ బ్యాగ్‌లో చెయిపెట్టి చూసుకుంటూ, ఆమె ఇంకా చెప్పుకుపోతూ ఉన్నది

పోస్టాఫీసులో కిటికీకెదురుగా కూర్చుని ఏదో వ్రాసుకుంటున్న వేణు, నాగస్వరం విని పడగెత్తే త్రాచుమాదిరిగా తలెత్తి చూచాడు. ఆ కంఠస్వరం విని ఆ మాట్లాడే తీరు పరికించి అలనలాగే ఆమె వైపు చూస్తూ కూర్చున్నాడు.

"...ఒక చిన్న పార్శిల్ కూడ ఉన్నది... మీరు కొన్ని పోస్టేజిస్టాంపులుకూడ యివ్వాలి. పార్శిల్ ఏది... ఆఁ, పావలా స్టాంపులు ఒక ఎనిమిదివ్వండి చాలు... రెండణా స్టాంపులు పన్నెండు, కాదు, ఒక పదహారివ్వండి ... అణా స్టాంపులు ... సరే, ఇదుగో ముందు ఈ పార్శిల్ తీసుకోండి .." అంటూ ఆమె చెయిజాచి పార్శిల్ అందివ్వబోతూ తలెత్తి ఆ బ్రాంచి పోస్టుమాస్టర్ వైపు చూసింది.

"చిట్టీ!" అనేమాట అప్రయత్నంగా అతని నోటినుండి వెలువడింది అతనింకా అలాగే ఆమె వైపు చూస్తు కూర్చున్నాడు.

ఆమెకూడా ఆశ్చర్యంగా అతనివైపు చూస్తూ నిల్చున్నది అతని నోటివెంట వెలువడిన మాట వినగానే ఆమె ఆశ్చర్యానికవధి లేక పోయింది. కళ్ళు పెద్దవి చేసి అతనివైపు సంభ్రమాశ్చర్యాలతో చూస్తూ నిలుచున్నది.

బాగా పెరిగి, ముఖంమీద పడుతూ నుదుటిని కప్పివేస్తున్న జుత్తును వెనక్కు సవరిస్తూ అతను చిరునవ్వు నవ్వాడు

"వేణూ" అన్నదామె హఠాత్తుగా

అంతవరకు ఆమెలో అవ్యక్తంగా కన్పిస్తున్న చికాకు అదృశ్యమయింది సంతోషంతో ఆమె కళ్లు మెరసినయ్!

"వేణూ! ఇక్కడ!!" ఆమె ముఖాన వింత కాంతి శోభిస్తున్నది.

"లోపలికి రా" అన్నాడు వేణు, అలాగె చిరునవ్వు నవ్వుతూ

ఇంతవరకూ లేని సిగ్గు ఒక్కసారిగా ఆమెను ముంచెత్తింది. కదలకుండా ఆమె అక్కడే తల వంచుకొని నిలబడింది... ముఖాన చిరు సిగ్గు దొంతరలతో, పెదవులపై మందహాసంతో తల వంచుకొని నిలబడిఉన్న ఆమెను చూస్తుంటే అతని హృదయంలో ఒక అస్పష్టరేఖ మెరసింది.

వేణు లేచి బయటికివచ్చి, "దయచేయ వచ్చు" అంటూ ఆమె చెయి పట్టుకొని లోనికి తీసుకువెళ్ళి కూర్చోపెట్టాడు.

ఎవరో అపరిచిత యువతిని వేణు అలా చెయి పట్టుకొని పిల్చుకురావటం చూసి, పోస్టుమేన్ లక్ష్మయ్య ఆశ్చర్యంగా నోరుతెరచి చూస్తు కూర్చున్నాడు

"అంత సేపటివరకు గుర్తుపట్టలేక పోయావేం చిట్టీ?" అని అడిగాడు.

"తమరి అవతారం అలా ఉన్నది మరి.. ఆ తాతాచార్యులవారి ముద్ర ఉండబట్టి సరిపోయింది. లేకపోతె ఇంకెంతసేపు పట్టేదో!

"తాతాచార్యులవారి ముద్రా! అరె, అదా! అవునుమరి, తాము వేసిన ముద్రను తాతాచార్యులవారు సులభంగానే గుర్తించారన్నమాట!" అన్నాడు వేణు తన నుదుటిపైన ఉన్న మచ్చను తడుముకుంటూ.

అతని మాటలకామె సిగ్గుపడి తలవంచుకొన్నది.

సిగ్గుతో ఎర్రబారిన ఆమె చెక్కిళ్ళను చూస్తూన్న వేణుకు గత సంఘటన తలంపుకు వచ్చింది.

ఎనిమిది సంవత్సరాల క్రితం...

చిట్టి నాన్నగారు పోస్టల్ సూపరింటెండెంటుగా పని చేస్తూ వేణు వాళ్ళ యింటిపక్కన కాపురం ఉంటుండేవాళ్ళు ..ఒక రోజు చిట్టి చాంతాడు

కొరకు వచ్చింది వేణు వాళ్ళ యింటికి. చేంతాడు ఒక కొస పట్టుకొని ఈడ్చుకుంటూ పోతుండగా తాను వచ్చాడు. పిలవంగానే ఆగింది కాని, ఎక్కడికని అడిగితే సమాధానం చెప్పలేదు. మళ్ళా అడిగాడు. సమాధానం చెప్పకుండానే వెళ్ళబోయింది. అప్పుడు తాను చేంతాడు రెండు కాళ్ళతో తొక్కిపట్టి నిల్చున్నాడు ..

అప్పుడు చిట్టి చేంతాడు వదలమన్నది తాను కదలలేదు. మళ్ళా అడిగింది తాను సమాధానం చెప్పలేదు. అంతటితో చిట్టి తాడును రెండు చేతుల్తో పట్టుకుని హఠాత్తుగా గుంజింది. అలా గుంజటంతో తాను ఊపును సంబాళించుకోలేక పక్కవాటంగా క్రిందపడ్డాడు.

కుడికంటి పైభాగంలో ఏదో చురుక్కుమన్నట్లనిపించింది. చేత్తో తడిమిచూస్తే చేతికి రక్తం అంటింది. నెత్తురు చూడగానే ఎక్కడాలేని బాధ కలిగింది. ఏడుపొచ్చింది. తాను ప్రయత్నించి ఏడుపుఆపుకొన్నా, కళ్ళవెంబడి నీళ్ళు కారుతూనే వున్నాయి. లేచి చిట్టివైపు చూశాడు తాను. తలకు దెబ్బతగిలి నెత్తురు కారుతుండటం చూడగానే చిట్టిప్రాణాలు పైనే పోయిఉంటయ్. బితుకు బితుకుమంటూ చూస్తూ నిల్చున్నది తాను కొట్టాడేమోనని.

తనకు చిట్టిని కొట్ట బుద్ధేయలేదు. మాట్లాడకుండా తానక్కడినించి బయలుదేరాడు ఒక క్షణం ఆగి చిట్టి తనను పిల్చింది. తాను మాట్లాడలేదు. మళ్ళా పిల్చింది. ఇంతలో పరిగెత్తుకొచ్చి చొక్కాపట్టుకున్నది తాను ఏంమాట్లాడకుండా నిలబడ్డాడు.

"మాట్లాడవూ?" అంటూ ఏడుపుగొంతుతో అడిగింది.

తన కానుకొని వెనకనె నిలబడింది. కాని తానేమీ మాట్లాడకపోయేటప్పటికి, ముందుకు వచ్చి నిలబడింది. తాను తొలగి వెళ్ళబోతే, మళ్ళా అడ్డంవచ్చి నిలబడింది. అంతటితో తాను అక్కడే చతికిలపడి కూర్చున్నాడు.

చిట్టి కూడా అక్కడే కూర్చున్నది. చేంతాడుకు ఎక్కడున్నదో అక్కడే పడేసి ఉంచింది. తాను జేబులోవున్న కాగితంతో నెత్తురు తుడుచుకుంటుంటే తనకు దగ్గరగా జరిగి కూర్చున్నది.

"ఇక ఎప్పుడూ అలా చేయను వేణు, మాట్లాడవూ!" అన్నది.

తాను చిట్టితో మాట్లాడకూడదనుకొన్నాడు, మాట్లాడలేదు.

"వేణూ, మాట్లాడవూ" అన్నది తన ముఖాన్ని ఆమె వైపు తిప్పుతుంటూ.

తాను చిట్టిముఖం వైపుచూశాడు. ఈ సంఘటనవలన ఆమెకు కలిగిన బాధ స్పష్టంగా కనిపించింది. అలా చూస్తుండగా, ఎందుకనో తన కళ్ళంబో మళ్ళా నీళ్ళు తిరిగినయ్. తాను ఏంమాట్లాడక తల తిప్పుకున్నాడు...

హఠాత్తుగా చిట్టి తలను తన ఒళ్ళోపెట్టి వెక్కి వెక్కి ఏడవసాగింది. పిచ్చిపిల్ల! అంతటితో తాను తన పట్టుదల విడిచిపెట్టి చిట్టిని ఓదార్చవలసి వచ్చింది.

ఆనాటి మచ్చ ఇది...ఆనాటి గాయం మానింది కాని మచ్చ మాత్రం చిరస్థాయిగా ఏర్పడింది.

ఆనాడు, ఆ కొద్ది క్షణాలు ఎంతటి క్లేశం అనుభవించినా, ఈనాడు తల్చుకొనేందుకు అవి మధుర క్షణాలుగా రూపొందినై!

చిట్టికి, వేణుకు ఉన్న పరిచయం అటువంటిది. మధ్యలో ఎటువంటి అవాంతరాలూ ఏర్పడకపోతే ఎలా ఉండేదో కాని, చిట్టితల్లి చచ్చిపోయిన తరువాత, చిట్టినాన్నగారు ఉద్యోగం విడిచిపెట్టి కూతురిని తీసుకొని కాశీ వెళ్ళిపోయారు అలాగే చాలకాలం తీర్థయాత్రలు చేసుకొంటూ ఎక్కడెక్కడో తిరిగారు మొదట్లో కొంతకాలం ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగినయ్

"ఏమిటి ఆలోచిస్తున్నావు?" వేణు సాలోచనగా తన వైపు చూస్తుండటం గమనించి, ప్రశ్నించింది చిట్టి.

ఒక క్షణం నిర్నిమేషంగా చిట్టివైపు చూస్తూ ఏదో బరువు తీసినట్లుగా నిట్టూర్పు విడిచాడు వేణు.

"నాన్నగారెక్కడున్నారు? అసలు నీవు ఇక్కడికి రావటం ఎలా సంభవించింది? ఏమిటో, ముందీ సంగతి చెప్పు .." అన్నాడు వేణు, పుస్తకాలు సర్దుతూ

"నాన్న గారు కూడా యిక్కడే ఉన్నారు... ఇక నా రావటమంటావా-నిన్ను వెతుక్కుంటూ వచ్చాను" అన్నది చిట్టి.

అలా అన్నదే కాని, వేణు ఆమె వైపు చూడగానే సిగ్గుతో తలవంచుకొన్నది.

ఆమె ప్రశ్నలకు నవ్వుకొంటున్న అతని హృదయంలోని క్షీణరేఖ వేయి ద్యోతులతో ప్రకాశించింది!

"అయితే, మరి నాన్నగారెక్కడున్నట్లు?", అని అడిగాడు.

"ఆరోగ్యం అంత బాగాలేదు. ..చూపించుకొని వెళ్దామని యిక్కడికి వచ్చారు ఏమీలేదు. జనరల్ వీక్ నెస్ అన్నాడు డాక్టరు..."

"ఇలా కలుసుకోవటం జరగకపోయినట్లయితే."

"అయితే గియితే తప్పక కలుసుకునే వాళ్ళం"

"ఎలా?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు వేణు.

"ఇక్కడినుంచి మన ఊరికి వెళ్ళినా, మళ్ళీ యిక్కడికే రావాలిసివచ్చేది..."

ఆమె మాటలలోని సందేశాన్ని గ్రహించిన అతని హృదయం ఆనందంతో పులకరించింది!

లక్ష్మయ్యను ఆఫీసు చూసుకోనమని చెప్పి చిట్టితో బయలుదేరాడు వేణు

"ఇప్పుడైనా కలుసుకోవటం జరిగేదా!" సందేహాన్ని వెలిబుచ్చాడు వేణు.

"ఎందుకని?"

"ఈ తాతాచార్యులవారి ముద్రేగనక లేకపోతే .."

"అందుకనేగా ముద్రవేసి ఉంచింది!" అతని మాటలు పూర్తిగాకముందే అన్నదామె చిలిపిగా, అతని చేతిని ఆప్యాయంగా నొక్కుతూ. ★

---

(37-వ పేజీ తరువాయి)

"నాయుడుగారూ—సొమ్మిస్తారా యివ్వరా?" ఆవేశంతో అడిగాడు వెంకటరావు.

"ఏం సొమ్మయ్యా. మీ బాబుగారి సొమ్ము నాకడ దాచి పెట్టేవయ్యా—"

"మాటలు తిన్నగా రానియ్యవయ్యా—" వెంకటరావు కోడెక్కాడు.

"నోర్మూయ్—" చేతిలోని బెత్తం వెంకటరావు తలని ముద్దు పెట్టుకుంది. మిగిలిన యువకులు నాయుడుగారి వీపుని విమానంమోత మోగించారు. నాయుడుగారి బంధువులు కుర్రాళ్ళని చావ మోదారు.

ప్రేక్షకులు చేసే గోలకి అంతం లేకపోయింది. కుర్చీలు, బెంచీలు విలయతాండవము చేశాయి. కొందరు గ్రీన్ రూమ్ లోకి పరుగెత్తారు. నటకులకు రక్షణ లేకపోయింది. నాయుడుగారు, సోమేశంగారు తప్పుకున్నారు

"యిలాంటి అవకతవక పనులెప్పుడూ చెయ్యకు" ప్రేక్షకులలోని ఒకడు సాక్షీగా అన్నాడు.

వాళ్ళలోంచి యిద్దరు నాయకులు లేచారు. అందర్నీ శాంతింప చేశారు. అభినవ 'రేలంగి'గారు యువతలకొచ్చి జరిగిందంతా తెలుసుకున్నారు.

స్టేజియెక్కి అందరినీ శాంతింప జేశారు.

"ఆర్యులారా—జరిగిందంతా విన్నాను. తప్పు నాది కొంతవుంది యిందులో. యీ నాటకానికి ఒప్పుకోవడం, అడ్వాన్సు తీసుకోకపోవడం నా తప్పు. ఎవరినన్నీ యేమీ ప్రయోజనంలేదు. ఇంతకీ నాయుడుగారు మాయమైనారు. డబ్బు వారి దగ్గరవున్న మాట నిజం. వెంకటరావుగారిని అని ఏమీ ప్రయోజనంలేదు. మా నేజిమెంటువారిదీ, చాకిరీ వీరిదీను కనుక శాంతించండి నాయుడు గారి యింటిమీదకు దాడివెడలుదాం పదండి."

అందరూ ఒక్కసారిగా యువకుల కొచ్చేసారు.

నాయుడుగారింటి చుట్టూ మూగారు.

తలుపులు బ్రద్దలు గొట్టారు లోనుండి నౌఖరు వచ్చాడు.

"నాయుడుగారిప్పుడే రైలు కెళ్ళారండీ"

"ఎక్కడికి?"

"ఏమోనాకు తెలీదండీ." అందరూ వెళ్ళిపోయారు

"ఎంతసేపయింది?"

"అంతా పది నిముషములవుతుంది." ★